Follow: @mahaadaily

16-12-2025

# మహా పత్రిక

సంపుటి- 22 సంచిక- 357 పేజీలు-04 వెల-రూ.6

WWW.EPAPER.MAHAADAILY.COM

## కాంగ్రెస్‌తో పీకే ?



### ప్రియాంక గాంధీతో చర్చలు

### 2029 ఎన్నికలు లక్ష్యంగా వ్యూహాలు


**ఢిల్లీ, మహా:** దేశరాజకీయాల్లో సరికొత్త సమీకరణలు జరుగుతున్నాయి. బీహార్ లో ఖాతా తెరవలేకపోయిన పీకే మళ్ళీ వ్యూహకర్తగా ముందుకు సాగే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, పార్లమెంటరీ పార్టీ ఛైర్ పర్సన్ సోనియాగాంధీ ఇంటికి వెళ్లారు. ఆమె కుమార్తె, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీతో సుదీర్ఘ చర్చలు జరిపారు. దీంతో కొత్త సమీకరణాలపై చర్చలు మొదలయ్యాయి. బీహార్ ఎన్నికలలో బీజేపీ, జేడీయూ చేతిలో ఎదురైన ఓటమి తర్వాత.. ప్రియాంక గాంధీ స్వయంగా పీకేను ఇంటికి ఆహ్వానించినట్లు తెలుస్తోంది. ఎన్నికల ఓటమి తర్వాత ఇరు పార్టీల నేతలు మౌనంగా ఉంటున్నారు. ఇలాంటి సమయంలో ప్రియాంకతో పీకే భేటీ కావడంతో జాతీయ స్థాయిలో కొత్త చర్చకు ఆస్కారమిచ్చింది. ఈ భేటీని ఇరువర్గాలు తోసిపుచ్చుతున్నట్లు తెలుస్తోంది. 2017లో పీకే.. పంజాబ్ లో కాంగ్రెస్ నేత అమరీందర్ సింగ్ ను తన వ్యూహాలతో

మిగతా 2లో

టాప్ న్యూస్

### భారత్‌కు మళ్లీ వస్తా..

- మెస్సీ భావోద్వేగం



02

### వేలానికి వేళాయే..

- ఐపీఎల్ 2026కు సిద్ధం



02

### ప్రియాంకకు ఏఐసీసీ పగ్గాలు?

- కాంగ్రెస్ అధిష్ఠానం ఏఐసీసీ నాయకత్వ మార్పుపై దృష్టి



02

# రేవంత్ గ్రాఫ్ పైపైకి...

## దేశవ్యాప్తంగా పెరిగిన ఇమేజ్

### 2028 గెలుపే లక్ష్యంగా మెగా ప్లాన్

గ్లోబల్ సమ్మిట్.. మెస్సీ టూర్.. పంచాయతీ గెలుపుతో ఫుల్ జోష్

సీఎంవో ప్రక్షాళన .. కేబినెట్ పునర్వ్యవస్థీకరణ

ప్రజలను మెప్పించేలా.. సంపూర్ణ మార్పులు

త్వరలో మూసీ తొలివిడత.. గాంధీ సరోవర్ కు శ్రీకారం

గ్రేటర్ హైదరాబాద్ లో రాజకీయ మార్పులు

నామినేటెడ్ పదవుల భర్తీ.. జిల్లాల వారీగా యంగ్ టీం

సీఎం ప్లాన్ కు రాహుల్ గ్రీన్ సిగ్నల్.. త్వరలో కొత్తకొత్తగా



**హైదరాబాద్ - మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెండేళ్ళపాలనకు పంచాయతీ ఎన్నికల రూపంలో ప్రజామోదం లభించింది. గ్లోబల్ సమ్మిట్, మెస్సీటూర్, విజన్ 2047 ప్రణాళికలతో రేవంత్ తపన ముందుచూపు ప్రజలను ఆకర్షించింది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ సీఎం లలో రేవంత్ ది బెస్ట్ అనేలా చేసింది. ఇటు రాష్ట్రంలో.. అటు దేశంలో పవర్ ఫుల్ సీఎంగా, పరిపాలనపై పట్టున్న సీఎంగా గ్రాఫ్ పైపైకి ఎగబాకింది. జూబ్లీహిల్స్ తో సిటీలో.. పంచాయతీ ఎన్నికలతో రూరల్ లో.. శషభిషలు లేకుండా రేవంత్ పాలన సూపర్ అని ప్రజలు తీర్పునిచ్చేశారు. రెండేళ్ల పాలనలో సీఎం రేవంత్ ప్రదర్శించిన రాజకీయ పరిపక్వత, పాలనా దక్షత ఆయకు పార్టీలో తిరుగులేని ఇమేజ్‌ను తెచ్చిపెట్టాయి. ఇలాంటి పరిస్థితుల్లో 2028లో మళ్ళీ మరోసారి కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా రేవంత్ భారీ స్కెచ్ రూపకల్పన చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజలను మెప్పించేలా సంపూర్ణమార్పులకు శ్రీకారం చుడుతున్నారు.

## దక్షిణ భారత రథసారథులు

### సంపద సృష్టిలో తెలంగాణ, సాగు విప్లవంలో ఆంధ్రా


ఆర్బీఐ నివేదిక సంచలనం

తలసరి ఆదాయంలో తెలంగాణ రికార్డు.. ఎగుమతుల్లో ఏపీ ప్రభంజనం

ఐటీ, ఫార్మాలో తెలంగాణ.. ఆక్వా, పండ్లలో ఏపీ ఆధిపత్యం

రెండు రాష్ట్రాలు.. విభిన్న వ్యూహాలు

**హైదరాబాద్- మహా:** విభజన జరిగిన దశాబ్దం తర్వాత తెలుగు రాష్ట్రాలు దేశ ఆర్థిక పటంలో తమదైన ప్రత్యేక ముద్రను వేస్తున్నాయి. భారతీయ రిజర్వ్ బ్యాంక్ తాజాగా విడుదల చేసిన 'హ్యాండ్‌బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ఆన్ ఇండియన్ స్టేట్స్ 2024-25' నివేదిక ఈ విషయాన్ని స్పష్టం చేసింది. రెండు రాష్ట్రాలు ఒకదానికొకటి తీసిపోని రీతిలో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయి. అయితే, ఈ ప్రగతి ప్రస్థానంలో రెండు రాష్ట్రాలు ఎంచుకున్న మార్గాలు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి



ప్రత్యేక కథనం 4లో



## వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తా....

- రాజకీయ పార్టీగా జాగృతిని మారుస్తాం
- త్వరలోనే గ్రామ స్థాయి కమిటీల ఏర్పాటు
- ఎమ్మెల్సీ కవిత సంచలన ప్రకటన



**హైదరాబాద్, మహా :** జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన రాజకీయ భవిష్యత్తుపై కీలక ప్రకటన చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను కచ్చితంగా పోటీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. సోమవారం ఎక్స్ వేదికగా ఆమె నెటిజన్లతో 'ఆస్క్ కవిత' పేరుతో క్వశ్చన్ అవర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెటిజన్లు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఈ సందర్భంగా ఓ నెటిజన్ "మీ కొత్త పార్టీ పేరు ఏంటి?" అని ప్రశ్నించగా, "ఎలా ఉండాలో మీరే చెప్పండి" అంటూ కవిత సమాధానమిచ్చారు. త్వరలోనే జాగృతి సంస్థ కార్యకలాపాలను గ్రామస్థాయి వరకు విస్తరిస్తామని, ప్రతి గ్రామంలో కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. జాగృతి సంస్థ ద్వారానే ఎన్నికల బరిలో నిలవబోతున్నట్లు పరోక్షంగా సంకేతాలు ఇచ్చారు. 2047 నాటికి దేశ ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించడమే తన జీవిత లక్ష్యమని కవిత పునరుద్ఘాటించారు. ఇదే తన విజన్, మిషన్ అని ఆమె పేర్కొన్నారు.

మిగతా 2లో

## తెలుగు రాష్ట్రాల్లో కల్తీ నెయ్యి మాఫియా దందా!

### తిరుమల లడ్డూ నుంచి సికింద్రాబాద్ టిఫిన్ దాకా.. కల్తీ కోరల్లో రెండు రాష్ట్రాలు

ఆవు నెయ్యి ముసుగులో జంతువుల కొవ్వు, డాల్డా దందా

రూ.200 పెట్టుబడితో రూ.600 దోపిడీ.. కల్తీగాళ్ల నయా స్కెచ్

మన వంటింట్లో వాడే నెయ్యి అమృతం అనుకుంటే పొరపాటే. దైవ కార్యాలకు వాడే పవిత్రమైన నెయ్యిలోనూ అపవిత్రం చేరిపోయింది. ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్.. రెండు రాష్ట్రాలను ఇప్పుడు 'కల్తీ నెయ్యి' భూతం భయపెడుతోంది. మొన్నటికి మొన్న ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమల లడ్డూ ప్రసాదంలోనే కల్తీ నెయ్యి ఆరోపణలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించగా, తాజాగా హైదరాబాద్ నడిబొడ్డున మరో కల్తీ గుట్టు రట్టయింది. ఖమ్మం, విజయవాడ, తిరుపతి, హైదరాబాద్.. ఇలా ఊరూ వాడా తేడా లేకుండా విషాన్ని విక్రయిస్తున్న మాఫియా ఆగడాలపై ప్రత్యేక కథనం...

\- మహా, ఖమ్మం బ్యూరో




02

## బీహార్ జోష్‌తో బీజేపీ

- తమిళనాడు, అస్సాంలకు ఇంచార్జీల నియామకం
- ఇప్పటి నుంచే కార్యాచరణకు సన్నద్ధం
- తమిళనాడుకు పియూష్ గోయల్, అస్సాంకు బైజయంత్ పాండా



02

### గ్రామీణ ఉపాధి స్వరూపం

## మార్చేస్తున్న కేంద్రం

- కొత్త చట్టంతో 125 రోజుల పని పండుగ..
- మోదీ సర్కార్ సంచలన నిర్ణయం
- పాత చట్టం రద్దు దిశగా పార్లమెంట్‌లో కొత్త బిల్లు!




02

## తుది దశ పోరుకు రెడీ

### ముగిసిన ప్రచారం.. రేపే పోలింగ్

**హైదరాబాద్, మహా:** తుదిదశ పంచాయతీ ఎన్నికల పోరుకు తెలంగాణ రెడీ అయింది. రెండు విడతల పోరు ప్రశాంతంగా సాగగా, ఈ నెల 17 ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మూడో విడత గ్రామ పంచాయతీ పోలింగ్ జరగనుంది. ఈ విడతలో మొత్తం 182 మండలాల్లోని 3 752 గ్రామ పంచాయతీలు ఎన్నికల రంగంలోకి దిగుతున్నాయి. మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో 3,752 గ్రామ పంచాయతీలకు, 28,406 వార్డులకు 75,283 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఈ విడతలో 4,157 గ్రామాలకు, 36,434 వార్డులకు నోటిఫికేషన్ ఇవ్వగా.. 394 గ్రామాలు,7916 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. 3, 752 గ్రామ పంచాయతీల్లో 12,640 మంది సర్పంచ్ అభ్యర్థుల పోటీ పడుతున్నారు.



# రేవంత్ గ్రాఫ్ పైపైకి

హైదరాబాద్ - మహా



ముఖ్యమంత్రి రేవంత్ రెండేళ్ళపాలనకు పంచాయతీ ఎన్నికల రూపంలో ప్రజామోదం లభించింది. గ్లోబల్ సమ్మిట్, మెస్సీటూర్, విజన్ 2047 ప్రణాళికలతో రేవంత్ తపన ముందుచూపు ప్రజలను ఆకర్షించింది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ సీఎం లలో రేవంత్ ది బెస్ట్ అనేలా చేసింది. ఇటు రాష్ట్రంలో.. అటు దేశంలో పవర్ ఫుల్ సీఎంగా, పరిపాలనపై పట్టున్న సీఎంగా గ్రాఫ్ పైపైకి ఎగబాకింది. జూబ్లీహిల్స్ తో సిటీలో.. పంచాయతీ ఎన్నికలతో రూరల్ లో.. శషభిషలు లేకుండా రేవంత్ పాలన సూపర్ అని ప్రజలు తీర్పు నిచ్చేశారు. రెండేళ్ల పాలనలో సీఎం రేవంత్ ప్రదర్శించిన రాజకీయ పరిపక్వత, పాలనా దక్షత ఆయకు పార్టీలో తిరుగులేని ఇమేజ్‌ను తెచ్చిపెట్టాయి. ఇలాంటి పరిస్థితుల్లో 2028లో మళ్ళీ మరోసారి కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా రేవంత్ భారీ స్కెచ్ రూపకల్పన చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజలను మెప్పించేలా సంపూర్ణమార్పులకు శ్రీకారం చుడుతున్నారు. ఇందులో భాగంగానే సీఎంవోతో పాటు వివిధ శాఖల్లో మార్పులు చేర్పులు చేయనున్నట్లు తెలుస్తోంది. కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు కూడా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.

**ఇక సంచలనాలే**

గత రెండేళ్ళుగా రేవంత్ పనితీరుకు, కష్టపడ్డ విధానానికి ప్రజలు ఫుల్ మార్క్స్ వేసినా.. అధికార యంత్రాంగం తీరుపై అటు ప్రజలు, ఇటు సీఎం కూడా అసంతృప్తిగా ఉన్నారు. ఈ క్రమంలో సీఎంవోతో సహా రాష్ట్ర శాఖల్లో సంచలన మార్పులకు రెడీ అయ్యారు. సీఎంవోలో మెజారిటీ కార్యదర్శులపై మంత్రుల్లో, ఎమ్మెల్యేల్లో, అధికారుల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. ఇక్కడ ఉన్న వారిలో సగం మంది పనిచేయడం కంటే అడ్డం పెట్టడానికే ప్రాధాన్యమిస్తారని, పొరపాటున కూడా పనిచేయడానికి ప్రయత్నించరన్న ఫిర్యాదులున్నాయి. ఇక కొందరు లీకేజీ స్టార్లు, ప్రత్యర్థులకు సాయం చేసే అధికారులు ఉండగా, మరికొందరు మనకెందుకులే అన్న వైరాగ్యంతో ఉంటారన్న ఆరోపణలున్నాయి. సీఎం ఏరికోరి అద్భుత అవకాశాలిచ్చినా.. ఏడాదిన్నర రెండేళ్ళుగా ప్రూవ్ చేసుకోకపోగా, నష్టం చేశారన్న విమర్శలున్నాయి. ఇలాంటివన్నీ తెలిసినా.. ఇంతకాలం సహనంతో ఉన్న సీఎం ఇపుడు పూర్తి ప్రక్షాళన చేయాలని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. పలు మంత్రిత్వశాఖల్లోనూ ప్రత్యర్థులకు సాయం చేసే ఉద్యోగులు, పని విషయంలో నిర్లక్ష్యంగా ప్రదర్శించే అధికారులు, ప్రభుత్వంపై చులకనగా మాట్లాడిన అధికారులకు షాక్ తప్పదని తెలుస్తోంది. అన్నిస్థాయిల్లో అధికారులను మార్పులు చేర్పులు చేసి నూతనోత్సాహం కలిగించాలని సీఎం ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. జిల్లాల్లోనూ అనేకమంది అధికారులు ప్రత్యర్థులకు సహకరిస్తున్నా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఇన్ ఛార్జిలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో పలువురు కలెక్టర్లు, ఎస్పీలకు స్థానచలనం ఖాయంగా కనబడుతోంది. ఆదిలాబాద్ తో పాటు పలు జిల్లాల అధికారులకు స్థానచలనం ఖాయంగా కనబడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా అధికారుల పనితీరుపై సీఎం నివేదిక తెప్పించుకున్నారు.

**త్వరలో మూసీ మురిసేలా**

గ్లోబల్ సమ్మిట్ తో సూపర్ సక్సెస్ అయిన సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గాంధీ సరోవర్ నమూనాను ఆవిష్కరించారు. జనవరిలో గాంధీసరోవర్ పనులను సీఎం ప్రారంభించే అవకాశాలున్నాయి. మూసీ తొలివిడతకు కూడా రంగం సిద్ధం అవుతోంది. ఇక గ్రేటర్ హైదరాబాద్ లో కూడా పలు రాజకీయ సంచలనాలు చోటుచేసుకోనున్నాయి. పలువురు ఎమ్మెల్యేల చేరికకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం కనబడుతోంది. ఇక పెండింగ్ లో ఉన్న నామినేటెడ్ పదవులను సీఎం భర్తీచేసే అవకాశాలున్నాయి. జిల్లాల్లోనూ యంగ్ టీమ్స్ ఏర్పాటుచేసి.. 2028 లక్ష్యంగా బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నాయి. ముఖ్యమంత్రి పునరవ్యవస్థీకరణ ప్లాన్ కు రాహుల్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. త్వరలోనే కాంగ్రెస్ పునరుత్తేజం పొందేలా, 2028 విజయమే లక్ష్యంగా సరికొత్త ప్రణాళికకు సీఎం రెడీ అవుతున్నారు. వచ్చే జనవరి నుండి తెలంగాణ రాజకీయం సరికొత్తగా ఆవిష్కరణ జరిగే సంకేతాలు కనిపిస్తున్నాయి.

# తెలుగు రాష్ట్రాల్లో కల్తీ నెయ్యి మాఫియా దందా!

## తిరుమల లడ్డూ నుంచి సికింద్రాబాద్ టిఫిన్ దాకా.. కల్తీ కోరల్లో రెండు రాష్ట్రాలు

ఆవు నెయ్యి ముసుగులో జంతువుల కొవ్వు, డాల్డా దందా

రూ.200 పెట్టుబడితో రూ.600 దోపిడీ.. కల్తీగాళ్ల నయా స్కెచ్




రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రజల ఆరోగ్యం ఇప్పుడు ప్రమాదపుటంచున ఉంది. మనం ఎంతో ఇష్టంగా తినే స్వీట్లు, పిల్లలకు బలవర్ధకమని పెట్టే నెయ్యి అన్నం, హోటల్ లో తినే నేతి ఇడ్లీ.. ఇవన్నీ ఇప్పుడు సందేహంలో పడ్డాయి. తాజాగా హైదరాబాద్ నార్త్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు సికింద్రాబాద్ లో జరిపిన దాడిలో బయటపడిన విషయాలు సభ్య సమాజాన్ని నివ్వెరపోయేలా చేశాయి. అన్నమలై అనే వ్యాపారి కేవలం లాభాల కోసం ప్రజల ప్రాణాలతో ఎలా చెలగాటమాడుతున్నాడో చూస్తే, అసలు మనం తింటున్నది ఆహారమేనా అనే అనుమానం కలగకమానదు. ఈ కల్తీ నెయ్యి దందా ఇప్పుడు కేవలం హైదరాబాద్ నగరానికే పరిమితం కాలేదు. దీని వేళ్లు రెండు రాష్ట్రాల వ్యాప్తంగా బలంగా పాతుకుపోయాయి. ఆంధ్రప్రదేశ్ లోని తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిన నెయ్యి వాడారన్న ఆరోపణలు కోట్లాది మంది భక్తుల మనభావాలను దెబ్బతీయడమే కాకుండా, కల్తీ మాఫియా ఎంతలా తెగబడిందో కళ్లకు కట్టింది. అటు పవిత్ర పుణ్యక్షేత్రం నుండి ఇటు సామాన్యుడు తినే రోడ్డు పక్కన టిఫిన్ సెంటర్ వరకు ఈ నకిలీ నెయ్యి చాపకింద నీరులా విస్తరించింది. తెలంగాణలోని ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లోనూ ఇటీవల అధికారులు జరిపిన దాడుల్లో పామాయిల్, డాల్డాలతో తయారు చేసిన నకిలీ నెయ్యి నిల్వలు బయటపడటం ఆందోళన కలిగిస్తోంది. వ్యాపారులు అసలు ఆవు నెయ్యి జోలికి వెళ్లకుండానే, కేవలం రసాయనాలతో మాయ చేస్తున్నారు. పామాయిల్, డాల్డా, జంతువుల కొవ్వు మిశ్రమానికి ప్రమాదకరమైన సింథటిక్ రంగులు, ఘాటైన వాసన వచ్చే 'గీ ఎసెన్స్' కలిపి అచ్చం స్వచ్ఛమైన నెయ్యిలా భ్రమింపజేస్తున్నారు. కేవలం రూ.150 నుండి రూ.200 ఖర్చుతో తయారయ్యే ఈ విషపూరిత మిశ్రమాన్ని, ఆకర్షణీయమైన ప్యాకెట్లలో నింపి బ్రాండెడ్ నెయ్యి పేరుతో రూ.600 నుండి రూ.1000 వరకు విక్రయిస్తూ ప్రజలను నిలువునా మోసం చేస్తున్నారు. ఈ కృత్రిమ నెయ్యిని నిరంతరం వాడటం వల్ల గుండె జబ్బులు, క్యాన్సర్, జీర్ణకోశ వ్యాధులు వంటి ప్రాణాంతక సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. లాభార్జనే ధ్యేయంగా నడుస్తున్న ఈ మాఫియాపై పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. అయినప్పటికీ, ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని మారుమూల ప్రాంతాల్లో ఈ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. తక్కువ ధరకు వస్తుందని ఆశపడి రోడ్డు పక్కన, నమ్మకం లేని చోట లూజ్ నెయ్యిని కొనుగోలు చేయవద్దని అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, కల్తీని గమనిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు. లేదంటే ఈ 'తెల్లటి విషం' మన ఊపిరి తీయడం ఖాయంగా కనిపిస్తోంది.

# బీహార్ జోష్‌తో బీజేపీ

## తమిళనాడు, అస్సాంలకు ఇంచార్జీల నియామకం

ఇప్పటి నుంచే కార్యాచరణకు సన్నద్ధం

**తమిళనాడుకు పియూష్ గోయల్, అస్సాంకు బైజయంత్ పాండా**

**న్యూఢిల్లీ, మహా :** వచ్చే ఏడాది ప్రారంభంలోనే పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ముందుగానే కమలనాథులు కసరత్తు ప్రారంభించారు. బీహార్‌లో ఘన విజయం సాధించడంతో మంచి జోష్ మీద ఉన్న కాషాయ నేతలు త్వరలో జరగనున్న ఎన్నికల రాష్ట్రాలపై దృష్టి పెట్టారు. వచ్చే ఏడాది ప్రారంభంలో తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాంలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాలకు ఇన్‌ఛార్జ్‌లను బీజేపీ నియమించింది. తమిళనాడు బీజేపీ ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా పీయూష్ గోయల్ నియమితులయ్యారు. పీయూష్ గోయల్‌కు సహఇన్‌ఛార్జ్‌లుగా అర్జున్ రామ్ మేఘవాల్, మురళీధర్ మోహోల్ ఉండనున్నారు. ఇక అస్సాంలో జరగబోయే ఎన్నికలకు బైజయంత్ పాండా బీజేపీ ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా నియమితులయ్యారు. సహఇన్‌ఛార్జ్‌లుగా సునీల్ కుమార్ శర్మ, దర్శనా బెన్ జర్దోష్ ఉండనున్నారు. ఇప్పటికే తమిళనాడులో అన్నాడీఎంకేతో బీజేపీ పొత్తు పెట్టుకుంది. కూటమిగా ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. అధికారం చేజిక్కించుకోవాలని బీజేపీ పావులు కదుపుతోంది. ఇంకోవైపు అధికార డీఎంకే కూడా మరోసారి విజయం కోసం పోరాడుతుంది. ఇక కొత్తగా పార్టీ స్థాపించిన నటుడు విజయ్ కూడా టీవీకే విజయం కోసం పోరాడుతున్నారు. ఈసారి తమిళనాడులో ఎవరిని అధికారం వరించనుందో చూడాలి.

# భారత్‌కు మళ్లీ వస్తా

## మెస్సీ భావోద్వేగం

**మహా:** భారత్ పర్యటనలో భాగంగా ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో సోమవారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ పాల్గొన్నారు. స్టేడియంలో లియోనెల్ మెస్సీ పేరు మార్మోగింది. అభిమానుల కేకలకు మెస్సీ భావోద్వేగం చెందారు. అభిమానుల ప్రేమపై స్పందిస్తూ.. 'భారత్‌లో మాపై మీరు చూపిన ప్రేమకు హృదయపూర్వక ధన్యవాదాలు. ఇది ఒక ప్రత్యేకమైన అనుభవం. ఈ పర్యటన చాలా తక్కువ కాలం అయినప్పటికీ ఎంతో మధురానుభూతిని ఇచ్చింది. భారత్‌లో ప్రేమ ఉంటుందని నాకు తెలుసు కానీ.. ప్రత్యక్షంగా అనుభవించడం అద్భుతంగా ఉంది. మీ ప్రేమకు మరోసారి ధన్యవాదాలు. మేము తప్పకుండా మళ్లీ వస్తాం. మ్యాచ్ ఆడేందుకు కావొచ్చు లేదా ఇంకే సందర్భంలో అయినా సరే కానీ భారత్‌కు మళ్లీ రావడం మాత్రం ఖాయం' అని మెస్సీ అన్నారు.

# కాంగ్రెస్‌తో పీకే ?

## ప్రియాంక గాంధీతో చర్చలు.. 2029 ఎన్నికలు లక్ష్యంగా వ్యూహాలు

(మొదటిపేజీ తరువాయి)



సీఎంను చేశారు. అదే ఏడాది యూపీలో మాత్రం కాంగ్రెస్‌ఎస్పీ కూటమిని మాత్రం గెలిపించలేకపోయారు. ఆ తర్వాత కాంగ్రెస్ లోకి పీకే వస్తారని భావించినా పార్టీ సీనియర్లు ఆయన్ను అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్ తో తనకు చేదు అనుభవాలు ఉన్నాయని పీకే కూడా చెప్పుకున్నారు. అయితే ఇప్పుడు తాజా పరిణామాల తర్వాత పీకేకు ఆయన కోరుకున్న స్వేచ్ఛను ఇచ్చేందుకు ప్రియాంక గాంధీ సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు సీనియర్లతో పాటు రాహుల్ మాత్రం ఇందుకు ఇష్టపడటం లేదని మరో ప్రచారం ఉంది. వచ్చే ఏడాది కాంగ్రెస్ తమిళనాడు, బెంగాల్, అసోం ఎన్నికలు ఎదుర్కోవాల్సి ఉంది. అలాగే 2027లో యూపీ ఎన్నికలు ఎదుర్కోవాల్సి ఉంది. దీంతో తిరిగి పీకే కాంగ్రెస్ తో జట్టుకట్టేందుకు ఈ చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. త్వరలో దీనిపై క్లారిటీ నుంది. 2029 సార్వత్రిక ఎన్నికల లక్ష్యంతో పనిచేసేందుకు పీకే ఈ ప్రయత్నాలు చేస్తున్నట్లు కూడా మరో ప్రచారం జరుగుతోంది. మరో నెలరోజుల్లో ఈ అంశాలపై స్పష్టత వచ్చే అవకాశాలున్నాయని జాతీయ మీడియా సర్కిల్స్ లో చర్చ జరుగుతోంది.



# ప్రియాంకకు ఏఐసీసీ పగ్గాలు?

**ఢిల్లీ, మహా:** కాంగ్రెస్ అధిష్ఠానం ఏఐసీసీ నాయకత్వ మార్పుపై దృష్టిసారించినట్లు కనిపిస్తోంది. ప్రియాంక గాంధీకి ఏఐసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలన్న డిమాండ్ ఇపుడు జోరుగా సాగుతోంది. నాయకత్వ మార్పుపై పలువురు నేతలు ఇప్పటికే సోనియాకు లేఖలూ రాశారు. ఖర్గే అనారోగ్య కారణాలతో ఈ డిమాండ్ పెరిగింది. ఇందిర రూపురేఖలతో పాటు ఇటీవలి కాలంలో క్రియాశీలకంగా ఉన్న ప్రియాంక రాకతో కాంగ్రెస్ కు పునర్వైభవం వస్తుందని వారు భావిస్తున్నారు. లోక్ సభలో రాహుల్ ప్రతిపక్ష నేతగా రాణిస్తుండగా, అంతర్గతంగా పార్టీ పగ్గాలు ప్రియాంకకు అప్పగిస్తే పూర్తిస్థాయిలో పార్టీ సెట్ అవుతుందని సీనియర్లు సోనియాకు నివేదించినట్లు చెబుతున్నారు. ఖర్గే తర్వాత ప్రియాంక ఈ బాధ్యతలు అందుకుంటుందా? లేక ఇతర నేతకు అప్పగిస్తారా? చూడాలి.

# గ్రామీణ ఉపాధి స్వరూపం మార్చేస్తున్న కేంద్రం

## కొత్త చట్టంతో 125 రోజుల పని పండుగ..

మోదీ సర్కార్ సంచలన నిర్ణయం

పాత చట్టం రద్దు దిశగా పార్లమెంట్‌లో కొత్త బిల్లు!



**ఢిల్లీ, మహా:** దేశంలోని గ్రామీణ ముఖచిత్రాన్ని మార్చేసిన అతిపెద్ద పథకం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ) త్వరలోనే కనుమరుగు కాబోతోంది. గత రెండు దశాబ్దాలుగా కోట్లాది మంది కూలీలకు ఆసరాగా నిలిచిన ఈ చట్టాన్ని రద్దు చేసి, దాని స్థానంలో మరింత శక్తివంతమైన, కొత్త హంగులతో కూడిన మరో చట్టాన్ని తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకు సోమవారం లోక్‌సభలో సభ్యులకు అందించిన కొత్త బిల్లు ప్రతులు ఇప్పుడు ఢిల్లీ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. పేరు మారడమే కాదు, పని దినాలు కూడా పెరగనున్నాయన్న వార్త గ్రామీణ భారతావనిలో ఆసక్తి రేపుతోంది.

**కొత్త చట్టంతో 125 రోజుల పని పండుగ**

దేశవ్యాప్తంగా గ్రామీణ పేదలకు జీవనాధారంగా నిలుస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం మంగళం పాడబోతోంది. అయితే కూలీలు ఆందోళన చెందాల్సిన పనిలేదు, ఎందుకంటే పాత చట్టం స్థానంలో మరింత ప్రయోజనకరమైన కొత్త చట్టాన్ని తీసుకురావడానికి రంగం సిద్ధమైంది. దీనికి సంబంధించిన "వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్" బిల్లు ప్రతులను సోమవారం లోక్‌సభ సభ్యులకు పంపిణీ చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ చట్టాన్ని రద్దు చేసి, 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యమే ధ్యేయంగా ఈ కొత్త చట్టాన్ని మోదీ ప్రభుత్వం రూపొందించింది. ఈ కొత్త బిల్లులో గ్రామీణ కూలీలకు శుభవార్త ఉంది. ఇప్పటివరకు ఉపాధి హామీ పథకం కింద ఏడాదికి కేవలం 100 రోజుల పని దినాలు మాత్రమే కల్పించేవారు. కానీ కొత్తగా రాబోతున్న "జీ రామ్‌జీ" మిషన్ కింద ప్రతి గ్రామీణ కుటుంబానికి ఏడాదికి కచ్చితంగా 125 రోజుల పని దినాలను కల్పించాలని ప్రతిపాదించారు. అంటే అదనంగా మరో 25 రోజుల పని దొరకనుందన్నమాట. ఇది కరువు కోరల్లో చిక్కుకున్న గ్రామీణ ప్రాంతాలకు పెద్ద ఊరటనిచ్చే నిర్ణయం. గత కొద్ది రోజులుగా ఈ పథకానికి "పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజన" అనే పేరు పెడతారని ప్రచారం జరిగినప్పటికీ, తాజాగా సభ్యులకు ఇచ్చిన బిల్లులో మాత్రం "వికసిత్ భారత్" పేరుతోనే ఉండటం గమనార్హం. ఈ మార్పు కేవలం పేరుకు, పని దినాలకు మాత్రమే పరిమితం కాలేదు. నిధుల కేటాయింపులోనూ కేంద్రం భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. పాత చట్టంలో కూలీల వేతనాల భారాన్ని పూర్తిగా కేంద్రమే భరించేది. కానీ కొత్త బిల్లు ప్రకారం ఈ భారాన్ని కేంద్రం, రాష్ట్రాలు పంచుకోవాల్సి ఉంటుంది. సాధారణ రాష్ట్రాల్లో కేంద్రం 60 శాతం నిధులు ఇస్తే, రాష్ట్రాలు 40 శాతం భరించాలి. అయితే ఈశాన్య, కొండ ప్రాంత రాష్ట్రాలకు మాత్రం కేంద్రం 90 శాతం నిధులు సమకూరుస్తుంది. ఈ నిబంధన రాష్ట్ర ప్రభుత్వాలపై ఆర్థిక భారాన్ని మోపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఏది ఏమైనా, రెండు దశాబ్దాల నాటి చట్టాన్ని రద్దు చేసి, 125 రోజుల పని దినాలతో కొత్త చట్టాన్ని తేవడం నిజంగానే ఒక సంచలన నిర్ణయం.

# వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తా...



(మొదటిపేజీ తరువాయి)

కవిత తాజా ప్రకటనతో ఆమె భవిష్యత్ రాజకీయ ప్రణాళికలపై చర్చ మొదలైంది. జాగృతి అధ్యక్షురాలు కవిత బీఆర్ఎస్‌కు, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన అనంతరం రాష్ట్ర రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. కవిత సొంతగా రాజకీయాల్లో గుర్తింపు తెచ్చుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. తన మద్దతుదారులతో కలిసి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ పలు నిరసన కార్యక్రమాల్లో కూడా పాల్గొంటున్నారు. కొంత కాలంగా ప్రజా బాట పేరుతో నియోజకవర్గాలను చుట్టేస్తూ స్థానిక ప్రజలతో మమేకం కావడంతో పాటు సమస్యలపై వారితో మాట్లాడుతున్నారు. సందర్భం వచ్చినప్పుడల్లా అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీఆర్ఎస్ కీలక నేతలపై విమర్శలను గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ఆమె ఎక్స్‌లో ప్రజలతో తన అభిప్రాయాలు పంచుకునేందుకు ముందుకొచ్చారు. సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి మీ ప్రశ్నలు, ఆలోచనలు ఆస్క్ కవితతో పంచుకోవాలంటూ ఆమె ట్వీట్ చేశారు. దీంతో యూజర్లు ఆమెపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ క్రమంలోనే ఓ యూజర్ 2029 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తారా అని అడిగాడు. దీనికి కవిత అవును అంటూ సమాధానం ఇచ్చారు. దీంతో ఆమె వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పోటీగా ఎన్నికల బరిలోకి దిగనుందని క్లారిటీ వచ్చేసింది. జాగృతి కార్యక్రమాలు కేవలం నగరానికే పరిమితం చేశారు, ఎందుకు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించలేదని మరో యూజర్ ప్రశ్నించారు. దీనికి స్పందించిన కవిత రాష్ట్రవ్యాప్తంగా తాము పనిచేస్తున్నామని అన్నారు. తెలంగాణలో ప్రతీ గ్రామంలో కమిటీని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.

# సముద్రాలు దాటి వచ్చిన విజయం





- **కోడలిని గెలిపించిన మామ ఒక్క ఓటు**
- **అమెరికా నుండి వచ్చి ఓటేశారు**
- **ఒక్క ఓటు తేడాతో కోడలిని గెలిపించారు**
- **నిర్మల్ జిల్లాలో ఆసక్తికర ఘటన**

**హైదరాబాద్, మహా:** ప్రజాస్వామ్యంలో "ప్రతీ ఓటూ విలువైనదే" అని మనం తరచుగా వింటూ ఉంటాం. కానీ ఆ ఒక్క ఓటు నిజంగానే గెలుపోటములను ఎలా శాసిస్తుందో, అధికారాన్ని ఎలా నిర్ణయిస్తుందో నిర్మల్ జిల్లాలో జరిగిన ఓ సంఘటన కళ్ళకు కట్టినట్లు చూపించింది. ఒక్క ఓటు కదా అని నిర్లక్ష్యం చేయకుండా, ఏకంగా అమెరికా నుండి వచ్చి మరీ ఓటు వేసిన ఓ మామ.. తన కోడలికి అపురూప విజయాన్ని అందించారు.

**అమెరికా నుండి వచ్చి..**

నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం బాగాపూర్ గ్రామ పంచాయతీ ఎన్నికలు హోరాహోరీగా సాగాయి. ఈ ఎన్నికల్లో సర్పంచ్ స్థానానికి ముత్యాల శ్రీవేద పోటీ చేశారు. తన కోడలు ఎన్నికల బరిలో నిలవడంతో, ఆమెకు మద్దతు తెలపడమే కాకుండా, తన ఓటు హక్కును వినియోగించుకోవాలని భావించిన శ్రీవేద మామ ముత్యాల ఇంద్రకరణ్ రెడ్డి అమెరికా నుంచి బయలుదేరారు. ఎన్నికలకు నాలుగు రోజుల ముందే స్వగ్రామానికి చేరుకున్న ఆయన, పోలింగ్ రోజున బాధ్యతగా తన ఓటు వేశారు.

**ఉత్కంఠ రేపిన ఫలితం**

ఓట్ల లెక్కింపు సమయంలో ఫలితం అనూహ్యంగా మారింది. గ్రామంలో మొత్తం 426 ఓట్లు ఉండగా, 378 ఓట్లు పోలయ్యాయి. కౌంటింగ్ పూర్తయ్యేసరికి ముత్యాల శ్రీవేదకు 189 ఓట్లు రాగా, ఆమె ప్రత్యర్థి హర్షస్వాతికి 188 ఓట్లు వచ్చాయి. కేవలం ఒక్క ఓటు.. ఒకే ఒక్క ఓటు తేడాతో శ్రీవేద సర్పంచ్‌గా విజయం సాధించారు. ఒక్క ఓటు కూడా చెల్లనిదిగా తేలింది.

**గెలిపించిన బాధ్యత**

ఈ ఫలితాన్ని చూసిన వారంతా ఆశ్చర్యపోయారు. ఒకవేళ ఇంద్రకరణ్ రెడ్డి గారు అమెరికాలోనే ఉండిపోయి ఉంటే, లేదా ఒక్క ఓటే కదా అని నిర్లక్ష్యం చేసి ఉంటే నేడు ఫలితం మరోలా ఉండేది. ఆయన వేసిన ఆ ఒక్క ఓటే ఇప్పుడు నిర్ణయాత్మకమై, శ్రీవేదను విజయతీరాలకు చేర్చింది. ఆర్థికంగా విమాన టికెట్ ఖర్చుతో పోలిస్తే, ఆ ఓటు విలువ వెలకట్టలేనిదని ఈ విజయం నిరూపించింది.

**నగరవాసులకు గుణపాఠం**

ఇంటి పక్కనే పోలింగ్ బూత్ ఉన్నా, ఓటు వేయడానికి బద్ధకించే విద్యావంతులు, నగరవాసులకు ఈ ఘటన ఒక కనువిప్పు. ఓటు హక్కు మాత్రమే కాదు, అది ఒక బాధ్యత అని, ఒక్క ఓటుతో భవిష్యత్తు మారగలదని బాగాపూర్ ఫలితం చాటిచెప్పింది.




# వేలానికి వేళాయే

## ఐపీఎల్ 2026 కు సిద్ధం

**మహా:** ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఐపీఎల్ 2026 మినీ వేలానికి సమయం ఆసన్నమైంది. మరి కొద్ది గంటల్లో అబుదాబిలోని ఎతిహాద్ స్టేడియం వేదికగా ఈ మినీ ఆక్షన్‌కు తెరలేవనుంది. ఈసారి 10 జట్లలో గరిష్టంగా ఖాళీగా ఉన్న 77 స్థానాల కోసం 359 మంది ఆటగాళ్లు పోటీపడుతున్నారు. ఇందులో 110 మంది అంతర్జాతీయ ఆటగాళ్లు ఉండగా.. 31 మందికి అవకాశం దక్కనుంది. 10 ఫ్రాంచైజీలు రూ. 237.55 కోట్లు ఖర్చు చేయనున్నాయి. భారత కాలమానం ప్రకారం మంగళవారం (డిసెంబర్ 16) మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభం కానుంది. జియో హాట్‌స్టార్‌తో పాటు స్టార్ స్పోర్ట్స్ ఛానెల్స్‌లో వేలం ప్రత్యక్ష ప్రసారం కానుంది. ఈసారి రూ.2 కోట్ల బేస్ ప్రైజ్ విభాగంలో మొత్తం 45 మంది ఆటగాళ్లు ఉన్నారు. వెంకటేశ్ అయ్యర్, రవి బిష్ణోయ్, కామెరూన్ గ్రీన్, స్టీవ్ స్మిత్, జెమీ స్మిత్, ముజీబ్ ఉర్ రెహ్మాన్, నవీన్ ఉల్ హక్, సీన్ అబాట్, ఆస్టన్ అగర్, కూపర్ కన్నోలీ, జేక్ ఫ్రెజర్‌మెక్‌గుర్క్, జోష్ ఇంగ్లిస్, ముస్తాఫిజుర్ రెహ్మాన్, గస్ అట్కిన్సన్, టామ్ బాంటన్, టామ్ కర్రన్, లియామ్ డాసన్, బెన్ డకెట్ వంటి ఆటగాళ్ళున్నారు.


ANN తెలుగు

# మహా పత్రిక

03

మంగళవారం, తిరుపతి | 16-12-2025 | జనరల్ న్యూస్ | GENERAL NEWS | WWW.MAHAADAILY.COM

## అభివృద్ధే లక్ష్యంగా ముందుకు...




**లక్షెట్టిపేట, మహా:** అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామంటున్న పోతపల్లి గ్రామ సర్పంచిగా ఎన్నికైన నైనాల లక్ష్మి శంకర్.లక్షెట్టిపేట మండలంలోని పోతపల్లి గ్రామ సర్పంచ్ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన నైనాల లక్ష్మి శంకర్,ఐదుగురు వార్డు సభ్యులు సోమవారం కొక్కిరాల సత్యపాల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలోకి 30 మంది కార్యకర్తలతో చేరినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట మైనార్టీ టౌన్ ప్రెసిడెంట్ నవాబ్ ఖాన్,జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గుత్తికొండ శ్రీధర్,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు

# అనకాపల్లిలో అణువైన అడుగు

## 3 వేల ఎకరాల్లో బార్క్ భారీ ప్రాజెక్ట్!

- ఆంధ్రప్రదేశ్‌లో బార్క్ క్యాంపస్‌కు లైన్ క్లియర్
- ఏపీలో ప్రపంచ స్థాయి అణు పరిశోధన కేంద్రం
- గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన కేంద్రం



**హైదరాబాద్, మహా:** భారత అణుశక్తి రంగంలో ఆంధ్రప్రదేశ్ కీలక కేంద్రంగా మారబోతోంది. దేశీయ అణు పరిశోధనలను కొత్త పుంతలు తొక్కిస్తూ, బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ అనకాపల్లి జిల్లాలో ప్రతిష్టాత్మకమైన క్యాంపస్‌ను ఏర్పాటు చేయనుంది. దీనికి సంబంధించిన కీలకమైన అటవీ భూమి బదలాయింపునకు కేంద్ర పర్యావరణ శాఖ నుంచి అనుమతులు లభించడంతో, ఈ భారీ ప్రాజెక్టు నిర్మాణానికి మార్గం సుగమమైంది. భారత అణుశక్తి పరిశోధనల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. దేశంలో అణు శాస్త్ర పరిశోధనలు, అధునాతన రియాక్టర్ టెక్నాలజీలను బలోపేతం చేసే లక్ష్యంతో బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లాలో సుమారు 3,000 ఎకరాల విస్తీర్ణంలో భారీ పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని (ఆర్ అండ్ డి) ఏర్పాటు చేయనుంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటివరకు ఉన్న ప్రధాన అడ్డంకులు తొలగిపోవడంతో పనులు వేగవంతం కానున్నాయి. ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటికే 1,200 హెక్టార్లకు పైగా రెవెన్యూ భూమిని సేకరించగా, క్యాంపస్ నిర్మాణంలో అత్యంత కీలకమైన 148.15 హెక్టార్ల అటవీ భూమిని బదలాయించేందుకు బార్క్ చేసిన ప్రతిపాదనకు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ పరిధిలోని నిపుణుల కమిటీ తాజాగా సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. ప్రాజెక్టు మాస్టర్ ప్లాన్‌లో ఈ అటవీ భూమి ఎంతో కీలకం కావడంతో, ఈ అనుమతితో నిర్మాణ పనులకు తొలి అడ్డంకి తొలగిపోయినట్లయింది. దేశీయంగా అణు ఆవిష్కరణలు, స్వచ్ఛ ఇంధన వనరులపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన తరుణంలో ఈ కొత్త కేంద్రం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఇది రియాక్టర్ల అభివృద్ధి, నూతన ఇంధన సాంకేతికతలలో బార్క్ పాత్రను మరింత విస్తరిస్తుందని, భవిష్యత్తు అణు అవసరాలకు ఈ క్యాంపస్ ఒక కేంద్ర బిందువుగా మారుతుందని అధికారులు భావిస్తున్నారు. కాగా, బార్క్ ఇప్పటికే స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ల డిజైన్ పనులను ప్రారంభించినట్లు కేంద్రం ఇటీవల పార్లమెంటు వేదికగా వెల్లడించింది. మరోవైపు, రష్యాకు చెందిన రోసటామ్‌తో కలిసి చిన్న, పెద్ద అణు విద్యుత్ ప్రాజెక్టులపై సహకారం కోసం భారత అణుశక్తి విభాగం చర్చలు జరుపుతోంది. ఈ నేపథ్యంలో అనకాపల్లిలో ఏర్పాటు కానున్న ఈ భారీ క్యాంపస్, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అణు పరిశోధనలకు వేదికగా నిలవడమే కాకుండా, ప్రాంతీయంగా కూడా అభివృద్ధికి బాటలు వేస్తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## రవీంద్ర భారతి ప్రాంగణంలో ఎస్పీ బాలు విగ్రహావిష్కరణ

### పాల్గొన్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు

హాజరైన బండారు దత్తాత్రేయ, శ్రీధర్ బాబు, రామచందర్ రావు

తూర్పు గోదావరి జిల్లాలో ప్రత్యేకంగా తయారు చేయించిన 7.2 అడుగుల విగ్రహం



**హైదరాబాద్, మహా :** రవీంద్ర భారతి ప్రాంగణంలో దివంగత గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు తదితరులు హాజరయ్యారు. 7.2 అడుగుల ఎత్తు ఉన్న బాలు కాంస్య విగ్రహాన్ని తూర్పు గోదావరి జిల్లాలో ప్రత్యేకంగా తయారు చేయించారు. విగ్రహావిష్కరణలో భాగంగా రవీంద్ర భారతిలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బాలసుబ్రహ్మణ్యంకు ఇష్టమైన 20 పాటలతో ఈరోజు సాయంత్రం 50 మందితో సంగీత విభావరి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. భావితరాల కోసమే రవీంద్రభారతిలో బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. స్వర సార్వభౌమత్వానికి బాలసుబ్రహ్మణ్యం నిలువెత్తు నిదర్శనమని అభివర్ణించారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు. నెల్లూరులోని తన ఇంటిని వేద పాఠశాలకు బాలు ఇచ్చేశారని గుర్తు చేశారు. బాలు మన మధ్య లేకున్నా.. పాట రూపంలో మనతోనే ఉన్నారని చెప్పారు. ప్రతిఒక్కరి మనస్సులో బాలసుబ్రహ్మణ్యం చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. బాలు విగ్రహం ఏర్పాటుపై ప్రముఖ గాయని, ఆయన సోదరి ఎస్పీ శైలజ స్పందించారు. రవీంద్ర భారతిలో తన విగ్రహం పెట్టాలన్నది బాలసుబ్రహ్మణ్యం చివరి కోరిక అని వెల్లడించారు. తన విగ్రహాన్ని పెట్టాలని ఆర్కెస్ట్రా వారి వద్ద బాలు వ్యక్తం చేయగా, వారు అతనిని వారించారని అన్నారు. కానీ ఇప్పుడు ఆయన కోరిక నెరవేరిందని ఆమె అన్నారు. తెలుగును మరిచిపోవద్దని, క్రమశిక్షణగా ఉండాలని ఎస్పీ బాలు ఎప్పుడూ చెప్పేవారని అన్నారు. మరోవైపు.. బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడాన్ని తెలంగాణ వాదులు, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతో పాటు ఉద్యమకారుడు పృథ్వీరాజ్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో విగ్రహ ఆవిష్కరణ సమయంలో నిరసన తెలిపేందుకు సిద్ధమైన తెలంగాణ వాదులను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. రవీంద్ర భారతితో పాటు ఆ పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీసులను మోహరించారు.

# సర్పంచ్‌ల కోసం జిల్లాలో లీగల్ సెల్

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. బీఆర్ఎస్ సర్పంచ్ లను వేధిస్తే ఊరుకునేది లేదని హెచ్చరిక



**సిరిసిల్ల, మహా :** రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన సర్పంచులను ఇబ్బంది పెట్టాలని చూస్తే సహించేది లేదని, వారి రక్షణ కోసం ప్రతి జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రత్యేక న్యాయ విభాగాన్ని (లీగల్ సెల్) ఏర్పాటు చేస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. ఆదివారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లా నుండి గెలుపొందిన నూతన సర్పంచుల సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గెలిచిన అభ్యర్థులను అభినందిస్తూ, వారికి భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు.

**ప్రతి జిల్లాలో సర్పంచుల కోసం లీగల్ సెల్ ఏర్పాటు**

సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ మద్దతుదారులు కాంగ్రెస్ పార్టీ బెదిరింపులకు భయపడవద్దని కేటీఆర్ భరోసా ఇచ్చారు. "మిమ్మల్ని సస్పెండ్ చేస్తాం, ఇబ్బంది పెడతాం అని ఎవరైనా అధికారులు గానీ, పాలకపక్ష నేతలు గానీ బెదిరిస్తే ఒక్క క్షణం కూడా ఆలోచించకండి. వెంటనే పార్టీని సంప్రదించండి. మీ కోసం ప్రతి జిల్లాలో లీగల్ సెల్ ఏర్పాటు చేస్తున్నాం. అరగంటలో పార్టీ యంత్రాంగం మీకు అండగా నిలుస్తుంది, కోర్టు ద్వారా మన హక్కుల కోసం కొట్లాడుదాం" అని కేటీఆర్ స్పష్టం చేశారు. రాజ్యాంగబద్ధంగా గ్రామాలకు రావాల్సిన ఫైనాన్స్ కమిషన్ నిధులను ఎవరూ ఆపలేరని, ఆ నిధులు సాధించుకునే బాధ్యత తాము తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత**

కేవలం రెండేళ్ల పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని కేటీఆర్ విమర్శించారు. రైతుబంధు, రుణమాఫీ, పెన్షన్లు, మహిళలకు తులం బంగారం వంటి హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో 40 నుండి 70 శాతం స్థానాల్లో బీఆర్ఎస్ మద్దతుదారులు గెలవడమే ఇందుకు నిదర్శనమన్నారు. సూర్యాపేట జిల్లాలో మల్లయ్య యాదవ్ హత్య, తిప్పర్తిలో కిడ్నాప్ వంటి ఘటనలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పంచాయతీ ఎన్నికల్లో ప్రచారం చేసినా ప్రజల వ్యతిరేకత నుంచి కాంగ్రెస్ ని కాపాడలేకపోయారని కేటీఆర్ అన్నారు.

**పదవి ముఖ్యం కాదు.. పనే ముఖ్యం**

సర్పంచులు కేవలం పదవులను అలంకారప్రాయంగా కాకుండా, గ్రామాభివృద్ధికి సాధనంగా వాడుకోవాలని కేటీఆర్ సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తయిన వెంటనే, గెలిచిన సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు పంచాయతీరాజ్ చట్టం, విధులు, హక్కులపై అవగాహన కల్పించేందుకు నిపుణులతో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహిస్తామని కేటీఆర్ వెల్లడించారు. మిగిలిన విడత ఎన్నికల్లోనూ పార్టీ శ్రేణులు కష్టపడి గులాబీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. దేశ జనాభాలో కేవలం 3 శాతం ఉన్న తెలంగాణ, కేంద్రం ప్రకటించిన ఉత్తమ పంచాయతీ అవార్డుల్లో 30 శాతం కైవసం చేసుకుందని, ఇది కేసీఆర్ పాలన దక్షతకు నిదర్శనమని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ రికార్డును దేశంలో ఏ రాష్ట్రం కూడా సాధించలేదని అన్నారు.



## నా ఊర్లోనే నన్ను ఓడించారు


గ్రామాభివృద్ధికి కోటిన్నర ఖర్చు చేశా

భావోద్వేగానికి గురైన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల, మహా :** పంచాయతీ ఎన్నికల్లో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి సొంతరు రంగారెడ్డి గూడ ప్రజలు షాకిచ్చారు. ఇక్కడ బీజేపీ అభ్యర్థి కాటేపాగ రేవతి విజయం సాధించారు. దీనిపై స్పందించిన అనిరుధ్ రెడ్డి.. గ్రామాభివృద్ధికి రూ. 1.50 కోట్లు ఖర్చు చేసినా.. సొంతూరోళ్లే తన గుండెల మీద కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. రంగారెడ్డిగూడ లో సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోవడం ఎమ్మెల్యేకు పెద్ద షాక్‌గా మారింది. గ్రామంలో పోలైన 972 ఓట్లలో, బీజేపీ అభ్యర్థి 'కాటేపాగ రేవతి'కి 490 ఓట్లు రాగా.. కాంగ్రెస్ అభ్యర్థి అంజలికి 459 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో రేవతి 31 ఓట్ల స్వల్ప మెజారిటీతో విజయం సాధించారు. ఈ ఓటమిపై స్పందించిన అనిరుధ్ రెడ్డి.. "సొంత ఊరు రంగారెడ్డిగూడ అని చెప్పి ఊరును డెవలప్ చేయాలనే ఉద్దేశంతో రూ.1.50 కోట్లు నా చేతులతోనే మంజూరు చేశాను. కానీ, నన్ను అందరు కలిసి నమ్మించి సొంత ఊరోళ్లే సర్పంచ్ ఎన్నికల్లో నా గుండెల మీద కొట్టారు," అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తన అభ్యర్థి ఓటమికి బయటి నుంచి వేరే పార్టీ నాయకులు రంగారెడ్డిగూడకు వచ్చి కుట్రలు చేశారని ఆయన ఆరోపించారు. సాధారణంగా సొంతూరిలో ఎమ్మెల్యేలు బలంగా ఉంటారు. అనిరుధ్ రెడ్డి అంతటి ఖర్చు చేసి అభివృద్ధి చేసినప్పటికీ.. ఓటమి పాలు కావడం, కేవలం ప్రతిపక్ష పార్టీల కుట్రల కంటే.. పవన్ కళ్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలు.. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన ప్రచారం రంగారెడ్డిగూడ ప్రజల మనసుల్లో ఏదో ఒక స్థాయిలో వ్యతిరేకతను పెంచి ఉండవచ్చని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

## హౌసింగ్ బోర్డు భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు

- లీజు భూములు,షాపుల రెగ్యులరైజేషన్ కు అవకాశం
- ఇంటి పక్కనే ఉన్నవంద గజాల్లోపు స్థలాల విక్రయాలకు గ్రీన్‌సిగ్నల్
- రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి



**హైదరాబాద్, మహా :** హౌసింగ్ బోర్డు భూముల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, అంగుళం భూమి కూడా అన్యాక్రాంతం కావడానికి వీల్లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. హౌసింగ్ బోర్డు భూములపై సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. హౌసింగ్ బోర్డు భూముల లీజు, అగ్రిమెంట్లు, కోర్టు కేసులు, అద్దెలు తదితర అంశాలపై చర్చించారు. ఒకవైపు భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటూనే మరో వైపు లీజు, కమర్షియల్, అద్దెలు, రెగ్యులరైజేషన్ తదితర అంశాలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నిజాం కాలం నుంచి 115 సంస్థలకు హౌసింగ్ బోర్డు భూములను లీజుకు ఇవ్వడం జరిగిందని, ఇందులో ప్రధానంగా ఇనిస్ట్యూషన్స్, రెసిడెన్షియల్, కమర్షియల్, స్కూల్స్, టెంపుల్స్ తదితరాలు ఉన్నాయని, ఏడు స్థలాలకు సంబంధించి కోర్టు కేసులు, అలాగే అద్దె బకాయిలు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. లీజు అగ్రిమెంట్ పునరుద్ధరణ చేసుకోని సంస్థలకు హౌసింగ్ బోర్డు తరపున లేఖలు రాసి వాటి రెగ్యులరైజేషన్‌కు అవకాశం ఇవ్వాలని అధికారులకు మంత్రి సూచించారు. రాష్ట్రంలో హౌసింగ్ బోర్డుకు వివిధ ప్రాంతాల్లో 301 కమర్షియల్ షాపులు ఉండగా 2007లో అప్పటి ప్రభుత్వం ఇచ్చిన అవకాశం మేరకు 14 మంది షాపులు కొనుగోలు చేయగా మిగిలిన 287 షాపులకు గాను 62 షాపులు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయని, హౌసింగ్ బోర్డు నిబంధనల ప్రకారం ప్రతి షాపు యజమాని ప్రతి ఏడాది 10 శాతం అద్దెను పెంచుతూ షాపును రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుందని అయితే ఈ నిబంధన అమలు కాకపోవడంతో షాపు యజమానుల నుంచి హౌసింగ్ బోర్డుకు కోట్లాది రూపాయిలు రావలసి ఉందని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ప్రస్తుతం షాపులు నిర్వహిస్తున్నవారు ఆ షాపులను కొనుగోలు చేయడానికి ముందుకువస్తే మార్కెట్ ధర ప్రకారం విక్రయించడానికి అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. అలాగే షాపు నిర్వహణకు అనువుగా లేకపోతే ఆ స్థలాన్ని వేలంలో విక్రయించాలని సూచించారు. కోర్టు కేసులలో ఉన్న భూములు హౌసింగ్ బోర్డుకు చెందేలా పటిష్టమైన వాదన వినిపించేలా ప్రత్యేకంగా అడ్వకేట్‌ను నియమించుకోవాలని సూచించారు. హౌసింగ్ బోర్డు గతంలో కేటాయించిన ఇండ్లకు పక్కనే ఉన్న వంద గజాల లోపు స్థలాలను ఆఇంటి యజమానికి ఆసక్తి ఉంటే విక్రయించాలని అలాగే గతంలో ఇంటి కోసం హౌసింగ్ బోర్డు కేటాయించిన స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకోనివారికి ఇప్పుడు రిజిస్ట్రేషన్ అవకాశం కల్పించాలని, పక్కనే ఉన్న వంద గజాలలోపు స్థలాన్ని కూడా కొనుగోలు చేసుకుంటే మొత్తం స్థలానికి రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశం కల్పించాలని సూచించారు. మార్కెట్ ధర, సబ్ రిజిస్ట్రార్ మార్కెట్ కార్డు విలువ వంద గజాలలోపు స్థలాల వివరాలు, రిజిస్ట్రేషన్ కాని ప్లాట్ల వివరాలు, రిజిస్ట్రేషన్ చేసుకొని పక్కనే ఉన్న వంద గజాలలోపు స్థలాన్ని అడుగుతున్నవారి వివరాలు తదితర అంశాలపై పూర్తిస్థాయి నివేదిక తయారు చేయాలని అధికారులకు సూచించారు. వీటన్నింటిపై క్యాబినెట్‌లో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ బోర్డు ఎండీ విపి గౌతమ్, సీఈ వెంకట రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ పేరిట భారీ మోసం

- పేదలే టార్గెట్, బోర్డు తిప్పేసిన నిర్వాహకులు
- అజ్ఞాతంలో శివాని.. కోట్లలో కుచ్చుటోపి
- విస్సన్నపేట కేంద్రంగా వెలుగుచూసిన ఆర్థిక నేరం
- ప్రత్యేక బృందాలతో పోలీసుల దర్యాప్తు



**హైదరాబాద్, మహా:** సామాన్యులనే లక్ష్యంగా చేసుకుని, వారికి రంగుల కలలు చూపిస్తూ ఆర్థికంగా మోసగించే ఘటనలు నిత్యం వెలుగుచూస్తూనే ఉన్నాయి. తాజాగా 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' పేరుతో ఓ సంస్థ అమాయక ప్రజల నుండి భారీగా డిపాజిట్లు వసూలు చేసి, చివరికి బోర్డు తిప్పేసిన ఘటన ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటలో కలకలం రేపుతోంది. పేద, మధ్య తరగతి ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇస్తామంటూ నమ్మబలికిన నిర్వాహకులు, కోట్లాది రూపాయలు వసూలు చేసి పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విస్సన్నపేట కేంద్రంగా కార్యకలాపాలు సాగించిన 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' సంస్థ నిర్వాహకులు శివాని, దుర్గాప్రసాద్ దంపతులు ప్రజలను నమ్మించడానికి ఆకర్షణీయమైన బ్రోచర్లతో ప్రచారం నిర్వహించారు. పేదలు, మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పాటు అందిస్తామని నమ్మబలికి సోషల్ మీడియా ఇన్‌ఫ్ల్యూయన్సర్లతో కూడా భారీగా ప్రచారం చేయించారు. వీరి మాటలు నమ్మి మచిలీపట్నం, భవానీపురం, విస్సన్నపేట, రాజోలు, కాకినాడ, ఏలూరు, ఖమ్మం తదితర ప్రాంతాల నుండి భారీ సంఖ్యలో ప్రజలు ఈ సంస్థలో పెట్టుబడులు పెట్టారు. ముఖ్యంగా డ్వాక్రా మహిళలనే లక్ష్యంగా చేసుకున్న నిర్వాహకులు, వారికి బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు కాగానే ఊళ్లలో సమావేశాలు పెట్టి, అధిక వడ్డీ ఆశచూపి ఆ డబ్బును తమ సంస్థలో పెట్టుబడి పెట్టేలా చేశారు. చాలామంది మహిళలు తమ బంగారాన్ని, ఇంటి పత్రాలను సైతం తాకట్టు పెట్టి మరీ ఇందులో డిపాజిట్ చేయడం గమనార్హం. డిపాజిట్లు భారీగా రాగానే సంస్థ నిర్వాహకులు మార్చి నెల నుంచి చెల్లింపులు నిలిపివేశారు. గట్టిగా నిలదీసిన వారికి అరకొరగా చెల్లించి, మరికొందరికి చెక్కులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. అయితే సంస్థకు చెందిన నిధులు పక్కదారి పట్టినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. సంస్థకు చెందిన కరెంటు ఖాతాల నుండి దాదాపు 2 నుండి 3 కోట్ల రూపాయల వరకు కుటుంబ సభ్యులు, బంధువుల ఖాతాలకు మళ్లించినట్లు సమాచారం. శివాని తల్లిదండ్రుల నివాసంలో బాధితులు పరిశీలించగా భారీగా బంగారు ఆభరణాలు కొనుగోలు చేసిన రశీదులు లభించాయి. అలాగే శివాని బినామీల పేర్లతో ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయించినట్లు గుర్తించారు. ఈ వ్యవహారంపై బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో విస్సన్నపేట పోలీసులు రంగంలోకి దిగారు. బాధితుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సంస్థ నిర్వాహకుడు దుర్గాప్రసాద్ ఇప్పటికే మృతి చెందగా, ఆయన భార్య శివాని ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్నారు. రెడ్డిగూడెం మండలంలో ఆమె ఉన్నట్లు ప్రచారం జరిగినా పోలీసులు ధృవీకరించలేదు. స్థానిక ఎన్టీఆర్ కాలనీకి చెందిన అట్టదేవర రాజేష్ అనే బాధితుడు తాను రూ. 5 లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయానని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు చీటింగ్, డిపాజిటర్ల చట్టం కింద కేసు నమోదు చేశారు. సంస్థ బ్యాంకు లావాదేవీలను పరిశీలించి, ఖాతాలను సీజ్ చేసే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. బాధితులు ఎవరైనా ఉంటే ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు.

# చెరువు మాయం.. గ్రోవ్ పార్క్ ప్రత్యక్షం

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాజకీయాల్లో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు పెను ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. అధికార పార్టీ వైఫల్యాలను ఎండగట్టడం ఒక ఎత్తైతే, సొంత పార్టీలోని కొందరు నేతలు గతంలో సాగించిన భూ అక్రమాలపై ఆమె చేసిన పదునైన విమర్శలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. ముఖ్యంగా కుకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని 'ఉస్మాన్ ఖాన్ చెరువు' (కొన్ని రికార్డుల్లో ఉస్మాన్ కుంట) కబ్జా వ్యవహారంపై ఆమె చేసిన ఆరోపణలు అక్షర సత్యాలని రెవెన్యూ అధికారుల ప్రాథమిక విచారణలో తేలడం గమనార్హం. ఒకప్పుడు నిండుగా నీటితో కళకళలాడిన చెరువును పూడ్చివేసి, దానికి 'గ్రోవ్ పార్క్' అనే పేరు పెట్టి, అక్కడ విలాసవంతమైన రియల్ ఎస్టేట్ సామ్రాజ్యాన్ని నిర్మించిన వైనం ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంలో ఓ ఎమ్మెల్యే తనయుడి పాత్ర కీలకంగా ఉందని కవిత చేసిన ఆరోపణలు, దానికి అధికారుల నివేదికలు తోడవడంతో సదరు పార్టీకి చెందిన బడా నేతల్లో భయం పట్టుకుంది.

**చెరువు గర్భంలో వెలిసిన 'గ్రోవ్ పార్క్'**

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇటీవల మీడియా సమావేశంలో చేసిన ఆరోపణలు కేవలం రాజకీయ విమర్శలు కాదని, అవి వాస్తవ రూపం దాల్చిన అక్రమాల చిట్టా అని స్పష్టమవుతోంది. గత ప్రభుత్వ హయాంలో పలువురు బీఆర్ఎస్ నేతలు, ఎమ్మెల్యేలు తమ పదవులను అడ్డం పెట్టుకుని చెరువులను, ప్రభుత్వ భూములను యథేచ్ఛగా కబ్జా చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించిన "ఉస్మాన్ ఖాన్ చెరువు" (లేదా ఉస్మాన్ కుంట) వ్యవహారం ఇప్పుడు సంచలనంగా మారింది. రెవెన్యూ , ఇరిగేషన్ శాఖల రికార్డుల ప్రకారం, ఒకప్పుడు విస్తారంగా ఉన్న ఈ చెరువు ఇప్పుడు కుచించుకుపోయి, ఓ ప్రైవేట్ రియల్ ఎస్టేట్ వెంచర్లో భాగంగా మారిపోయింది.

**ఎమ్మెల్యే తనయుడి కనుసన్నల్లోనే కబ్జాపర్వం?**

కుకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన ఓ ప్రముఖ ఎమ్మెల్యే తనయుడికి చెందిన రియల్ ఎస్టేట్ సంస్థ ఈ కబ్జా వెనుక ఉందని కవిత బలంగా ఆరోపించారు. సదరు రియల్ ఎస్టేట్ సంస్థ, నిబంధనలకు విరుద్ధంగా చెరువు ఎఫ్‌టీఎల్ , బఫర్ జోన్‌లను ఆక్రమించిందని ఆమె పేర్కొన్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, కబ్జా చేసిన చెరువు స్థలాన్ని వారు ఏకంగా తమ వెంచర్‌లో కలిపేసుకోవడమే కాకుండా, దానికి "గ్రోవ్ పార్క్" అని నామకరణం చేసి, అదొక పార్కుగా, తమ వెంచర్‌కు అందాన్నిచ్చే ప్రదేశంగా మార్చేశారు. ఈ మొత్తం వ్యవహారం వెనుక సదరు ఎమ్మెల్యే తనయుడి హస్తం ఉందని, అధికారులపై ఒత్తిడి తెచ్చి అనుమతులు పొందారని కవిత ఆరోపించారు.

**నిజమేనని తేల్చిన రెవెన్యూ అధికారులు**

కవిత ఆరోపణల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపిన రెవెన్యూ మరియు నీటిపారుదల శాఖ అధికారులు దిగ్భ్రాంతికరమైన విషయాలను గుర్తించారు. గండిమైసమ్మ దుండిగల్ మండల పరిధిలోని గాగిల్లాపూర్ రెవెన్యూలో ఉన్న ఈ ఉస్మాన్ కుంట విస్తీర్ణం రికార్డుల్లో ఉన్నదానికీ, క్షేత్రస్థాయిలో ఉన్నదానికీ భారీ వ్యత్యాసం ఉన్నట్లు తేలింది. సుమారు 10 ఎకరాలకు పైగా విస్తరించి ఉండాల్సిన ఈ చెరువులో, దాదాపు 4 ఎకరాల వరకు మట్టి పోసి పూడ్చివేశారని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. "ప్రణీత్ ప్రణవ్ గ్రోవ్ పార్క్" పేరుతో వెలిసిన భారీ గేటెడ్ కమ్యూనిటీలో ఈ చెరువు భూములు కలిసిపోయాయని, చెరువు శిఖం భూమిని పార్కుగా మరియు వాకింగ్ ట్రాక్‌లుగా మార్చేశారని రెవెన్యూ వర్గాలు అనధికారికంగా ధృవీకరిస్తున్నాయి. హైడ్రా వంటి ప్రభుత్వ సంస్థలు కూడా ఈ అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించినట్లు సమాచారం. సాధారణంగా ప్రతిపక్షాలపై విరుచుకుపడే కల్వకుంట్ల కవిత, ఈసారి అనూహ్యంగా తన సొంత పార్టీ (బీఆర్ఎస్) నేతల అక్రమాలపైనే పరోక్షంగా మరియు ప్రత్యక్షంగా విమర్శనాస్త్రాలు సంధించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ముఖ్యంగా కేటీఆర్ హయాంలో జరిగిన కొన్ని భూ లావాదేవీలు, ల్యాండ్ కన్వర్షన్ల వ్యవహారాలను ఆమె ప్రస్తావించడం, ఎమ్మెల్యే కృష్ణారావు వంటి వారిని టార్గెట్ చేయడం సంచలనం సృష్టించింది.



# బాలీవుడ్‌లో టాలెంట్ చూపించనున్న

# డ్రాగన్ బ్యూటీ!

**సౌత్‌లోని భారీ బడ్జెట్ సినిమాలకు బాలీవుడ్ హీరోయిన్లను తీసుకోవడం ఈ మధ్య పరిపాటి అయిపోయింది. అయితే దక్షిణాదిలో టాలెంట్ నిరూపించుకుంటున్న భామలకు బాలీవుడ్ నుంచి కూడా పిలుపొస్తోంది. అందుకు యంగ్ బ్యూటీ శ్రీలీల పెద్ద ఉదాహరణ.. హిందీ హీరో కార్తీక్ ఆర్యన్‌కు జంటగా ఓ సినిమా చేస్తోంది. తాజాగా మరో సౌత్ బ్యూటీకి బాలీవుడ్ నుంచి పిలుపు వచ్చిందని ప్రచారం జరుగుతోంది. ఆ హీరోయిన్ మరెవరో కాదు రుక్మిణి వసంత్..**

**నాలుగేళ్ల గ్యాప్**

2019లో బీర్బర్ ట్రయాలజీ మూవీతో కన్నడలో ఎంట్రీ ఇచ్చింది రుక్మిణి. అదే ఏడాది అప్‌స్టార్స్ అనే హిందీ మూవీలో యాక్ట్ చేసింది. ఈ చిత్రం తనకు ఏమాత్రం ఉపయోగపడలేదు. దీంతో నాలుగేళ్ల గ్యాప్ తర్వాత సప్త సాగరదాచె ఎల్లో అనే కన్నడ సినిమాతో మరోసారి ప్రేక్షకుల ముందుకు వచ్చింది.

**తెలుగులో డ్రాగన్**

ఈ సినిమా తెలుగులో సప్తసాగరాలు దాటి టైటిల్‌తో విడుదలై మంచి స్పందన రాబట్టింది. దీని సీక్వెల్ కూడా సక్సెస్ అవడంతో పాటు రుక్మిణి అందానికి అందరూ ఫిదా అయ్యారు. మధ్యలో కొన్ని సినిమాలు చేసినా పెద్దగా మెప్పించలేకపోయింది. కాంతార: చాప్టర్ 1 చిత్రంతో మరోసారి సెన్సేషన్‌గా మారింది. ప్రస్తుతం ఈ బ్యూటీ యష్ 'టాక్సిక్', ఎన్టీఆర్ 'డ్రాగన్' సినిమాలు చేస్తోంది.

**బాలీవుడ్ నుంచి పిలుపు**

బాలీవుడ్ నుంచి తనకు ఆఫర్లు వస్తున్నట్లు ఫిల్మీదునియాలో ఓ వార్త చక్కర్లు కొడుతోంది. ఈ క్రమంలో రుక్మిణి మాట్లాడుతూ.. చిన్నప్పటినుంచి హిందీ సుపరిచితమైన భాషే అంది. ఒక బాలీవుడ్ సినిమా గురించి చర్చలు జరుగుతున్నాయని.. భగవంతుడి దయ ఉంటే త్వరలోనే ఆ ప్రయాణాన్ని ప్రారంభిస్తాను అని ఆశాభావం వ్యక్తం చేసింది.

# 83 ఏళ్ల వయసులో ఇంత ఎనర్జీ!

వయసు మీద పడుతుంటే ఒంట్లో శక్తి సన్నగిల్లుతుంది. అందులోనూ 80 దాటిందంటే అడుగు తీసి అడుగు వేయడం కూడా కష్టంగా ఉంటుంది. కానీ బిగ్‌బీ అమితాబ్ బచ్చన్ మాత్రం 83 (తన వయసు) అనేది జస్ట్ నంబర్ మాత్రమేనని, తానింకే కుర్రవాడినేనంటున్నారు. ఆయన చేసే పనులు కూడా అలాగే ఉన్నాయి.

**కేబీసీ షో హోస్ట్‌గా..**

అమితాబ్ సినిమాలతో పాటు కౌన్ బనేగా కరోడ్‌పతి (KBC) అనే షోను హోస్ట్ చేస్తున్నారు. దాదాపు రెండు దశాబ్దాలుగా ఈ షోని విజయవంతంగా నడిపిస్తున్నారు. ప్రస్తుతం కేబీసీ 17వ సీజన్ రన్ అవుతోంది. ఈ షోకి ఇటీవలే ద ఫ్యామిలీ మ్యాన్ టీమ్ మనోజ్ బాజ్‌పాయ్, జైదీప్ అహ్లావత్, షరీబ్ హష్మీ అతిథులుగా విచ్చేశారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో కేబీసీ అనుభవాలను పంచుకున్నాడు షరీబ్ హష్మీ.

**అంతా కలలా ఉంది**

ఆయన మాట్లాడుతూ.. అమితాబ్ గారిని కలిశానంటే ఇప్పటికీ అంతా ఒక కలలా ఉంది. ఆ అనుభవాన్ని నా జీవితాంతం గుర్తుపెట్టుకుంటాను. నా జర్నీ గురించి అడిగినప్పుడు ఆయన నాతోనే మాట్లాడారా? అని గాల్లో తేలిపోయాను. కానీ, ఆయన ఎనర్జీకి మాత్రం దండం పెట్టాల్సిందే! ఈ వయసులో కూడా ఆయన చాలా యాక్టివ్‌గా ఉంటారు. ఒక్క రోజులోనే మూడు ఎపిసోడ్ షూటింగ్స్ పూర్తి చేస్తారు. పొద్దున తొమ్మిదికల్లా సెట్‌కు వస్తే అర్ధరాత్రి వరకు అక్కడే ఉంటారు. మేము హాజరైన ఎపిసోడ్ షూటింగ్ అర్ధరాత్రి 12 గంటలకు జరిగింది.

**అలసట లేకుండా..**

మేమందరం కాసేపైనా ఓ చిన్న కునుకు తీస్తే బాగుండు అన్నట్లుగా ఉన్నామా? ఆయన మాత్రం నిద్రను దరిచేరనీయకుండా యాక్టివ్‌గా ఉన్నారు. అందుకే ఆయన అంత సెద్ద సూపర్ హీరో అయ్యారు అని షరీబ్ చెప్పుకొచ్చాడు. ఇటీవల అమితాబ్ సైతం ఓ బ్లాక్‌లో తాను ఉదయం ఐదున్నర గంటల వరకు పని చేసినట్లు తెలిపారు. ఇదంతా చూసిన అభిమానులు మీకున్న ఎనర్జీ, డెడికేషన్‌కు హ్యాట్సాఫ్ అని కామెంట్లు చేస్తున్నారు.







# ఏషియన్ సినిమాస్‌తో మహేశ్ బాబు..

టాలీవుడ్ స్టార్ హీరో మహేష్ బాబు ఏషియన్ సినిమాస్ సునీల్‌తో కలిసి AMB బ్రాండ్‌ను క్రియేట్ చేశారు. ఇప్పుడు దీనిని దేశవ్యాప్తంగా విస్తరించడానికి ప్లాన్స్ చేస్తున్నారు. హైదరాబాద్, బెంగళూరు తర్వాత కొత్త థియేటర్లు ఇతర నగరాల్లో కూడా ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే గచ్చిబౌలిలో AMB సినిమాస్ ఉంది.. ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో AMB క్లాసిక్ నిర్మాణంలో ఉంది. తాజా సమాచారం ప్రకారం హకీంపేట్‌లో కొత్త థియేటర్ నిర్మాణం జరుగుతోంది. 2027లో ప్రారంభం అవుతుందని అంచనా.. అయితే, మహేష్ బాబు తన ప్లాన్స్ ఇతర రాష్ట్రాల్లో కూడా అమలు చేయనున్నారు. మహేష్‌బాబు వేసిన దారిలో అల్లు అర్జున్ (AAA సినిమాస్), విజయ్ దేవరకొండ (AVD సినిమాస్), రవితేజ (ART సినిమాస్) వంటి స్టార్స్ కూడా అడుగులు వేస్తున్నారు. అయితే, మహేష్ మాత్రం ఈ రంగంలో చాలా దూకుడుగా ఉన్నారు. మొదట మెట్రో నగరాలను టార్గెట్ చేసిన ఆయన త్వరలో విజయవాడ, వైజాగ్, తిరుపతి, వరంగల్ వంటి నగరాల్లో కూడా తన వ్యాపారాన్ని విస్తరించే ఛాన్స్ ఉంది. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లో మహేష్ ప్లాన్ చేస్తున్న మూడో ప్రాజెక్ట్ హకీంపేట్(AMB Hakimpet)లో రానుంది. అక్కడ ఐమాక్స్ స్క్రీన్ వచ్చే అవకాశం ఉంది. ఇలా టాప్ రేంజ్ మల్టీప్లెక్స్‌లు ఏర్పాటు చేస్తున్న మహేష్ బెంగళూరులో కొత్త ప్రాజెక్ట్‌ను కూడా పూర్తి చేశారు. కపాలి థియేటర్ ప్రాంగణంలో AMB Cinemas Kapali త్వరలో ఓపెన్ కానుంది. దక్షిణ భారతదేశంలో మొట్టమొదటి డాల్బీ సినిమాను బెంగళూరులో సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రారంభించనున్నారు. దక్షిణ భారతదేశంలో అతిపెద్ద ఎంటర్టైన్‌మెంట్ బ్రాండ్‌గా AMB నిలవనుంది. మహేష్ బాబు, నమ్రత శిరోద్కర్‌తో కలిసి AMB Cinemasను లగ్జరీ బ్రాండ్‌గా రూపొందించారు. 7 స్టార్ లగ్జరీ, 7 3D స్క్రీన్స్, Dolby Atmos సౌండ్ సిస్టమ్‌తో గోవా, చెన్నై వంటి నగరాల్లో కూడా విస్తరణ చేసే ప్లాన్స్ ఉన్నాయి. అక్కడ డాల్బీ అట్మాస్, IMAX వంటి cuttingedge టెక్నాలజీని తీసుకువస్తున్నారు.



# తెలుగు తెరపై మరో క్రేజీ బయోపిక్..?

సినిమాల్లో బయోపిక్స్ కొత్తేం కాదు. నాలుగైదేళ్ల ముందు విపరీతంగా వచ్చాయి. ప్రస్తుతం ట్రెండ్ మారిపోవడంతో అప్పుడప్పుడు జీవితకథల్ని సినిమాలుగా తెరకెక్కిస్తున్నారు. ఈ మధ్య కాలంలో తెలుగులో వచ్చిన బెస్ట్ బయోపిక్ అంటే చాలామంది చెప్పే మాట 'మహానటి'. ఇది తెలుగు ఇండస్ట్రీ స్థాయిని పెంచిందని చెప్పొచ్చు. ఇప్పుడు టాలీవుడ్‌లో మరో క్రేజీ బయోపిక్‌కి రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇంతకీ ఏంటి విషయం? ప్రస్తుతం పాన్ ఇండియా మూవీ 'రామాయణ్'లో సీతగా చేస్తున్న సాయిపల్లవి.. త్వరలో తెలుగు బడా నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ తీయబోయే ఓ బయోపిక్‌లో నటించబోతుందని తాజాగా రూమర్స్ వస్తున్నాయి. అదే దిగ్గజ గాయని ఎమ్మెస్ సుబ్బలక్ష్మి జీవితకథ. సుబ్బలక్ష్మిగా సాయిపల్లవి కనిపించనుందనే విషయం.. సోమవారం ఉదయం నుంచి సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. మళ్లీ రావా, జెర్సీ, కింగ్డమ్ చిత్రాలు తీసిన గౌతమ్ తిన్ననూరి.. ఈ మూవీని హ్యాండిల్ చేయబోతున్నాడని అంటున్నారు. త్వరలోనే ఈ ప్రాజెక్ట్ విషయమై ప్రకటన వచ్చే అవకాశముందని కూడా మాట్లాడుకుంటున్నారు. అయితే ఇది రూమర్ మాత్రమేనా లేదంటే నిజమా అనేది కొన్నిరోజులు క్లారిటీ వచ్చే అవకాశముంది. ఒకవేళ తీస్తే ఏమేం చూపిస్తారనేది ఆసక్తికరం. ఎందుకంటే సుబ్బలక్ష్మి అంటే కేవలం సింగర్ మాత్రమే కాదు. అంతకు మించిన గుర్తింపు దేశవ్యాప్తంగా సొంతం చేసుకున్నారు. అలాంటి ఈమె బయోపిక్ అంటే ఏం చూపిస్తారు? ఎలా తీస్తారనేది ఇంట్రెస్టింగ్‌గా అనిపిస్తోంది. ఎమ్మెస్ సుబ్బలక్ష్మి పూర్తి పేరు మధురై షణ్ముఖవడివు సుబ్బులక్ష్మి. తమిళనాడులోని మధురైలో 1916లో పుట్టారు. కర్ణాటక శాస్త్రీయ సంగీత గాయనిగా పేరు తెచ్చుకున్నారు. భారతదేశంలో 'భారతరత్న' పొందిన తొలి సంగీత విద్వాంసురాలు, రామన్ మెగసెసే అవార్డును అందుకున్న మొదటి భారతీయ సంగీత కళాకారిణి ఈమెనే కావడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా "భారతదేశపు నైటింగేల్"గా పేరుగాంచారు.



# బాక్సాఫీస్ షేక్ చేస్తోన్న దురంధర్..

బాలీవుడ్ స్టార్ రణవీర్ సింగ్ హీరోగా వచ్చిన లేటేస్ట్ స్పై యాక్షన్ థ్రిల్లర్ ధురంధర్. డిసెంబర్ 5న థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ దుమ్ములేపుతోంది. రిలీజైన పది రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.550 కోట్ల మార్కును దాటేసింది. దేశవ్యాప్తంగా నెట్ వసూళ్లపరంగా చూస్తే రూ.364.60 కోట్లు సాధించింది. రెండో ఆదివారం ఇండియాలో ఏకంగా రూ.58.20 కోట్ల నికర వసూళ్లను రాబట్టింది. ఇప్పటి వరకు ఒక హిందీ చిత్రానికి వచ్చిన రెండో ఆదివారం అత్యధిక వసూళ్లు కావడం విశేషం. కాగా.. ఈ మూవీపై ఇప్పటికే పలువురు స్టార్స్ ప్రశంసలు కురిపించారు. అల్లు అర్జున్ సైతం మేకర్స్‌ను కొనియాడారు. ఈ మూవీ సూపర్ హిట్ కావడంతో రణ్‌వీర్ సింగ్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. తన ఆనందాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. అదృష్టానికి మంచి అలవాటు ఉంది. సమయానికి తగ్గట్టు అది మారుతూ ఉంటుంది. కానీ, ఓర్పు చాలా ముఖ్యం అంటూ సోషల్ మీడియాలో రాసుకొచ్చారు. 2025లో అత్యధిక కలెక్షన్స్ వచ్చిన ఇండియన్ చిత్రాల జాబితాలో ధురంధర్ ఏకంగా నాలుగో స్థానానికి చేరుకుంది. ఈ మూవీ కంటే ముందు కాంతార: చాప్టర్ 1 ఛావా, సైయారా తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. మరిన్ని రోజులు ఇదే జోరు కొనసాగితే దురంధర్ స్థానం మరింత మెరుగయ్యే అవకాశమున్నట్లు కనిపిస్తోంది. దురంధర్ దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు రూ.430.20 కోట్లుగా గ్రాస్ వసూళ్లు రాబట్టింది. ఓవర్‌సీస్‌లో రూ.122.50 కోట్లకు పైగా కలెక్షన్స్ సాధించింది. రెండో వీకెండ్‌లో శుక్రవారం రూ34.70 కోట్లు, శనివారం రూ.53.70 కోట్లు, ఆదివారం రూ.58.20 వసూళ్లతో అరుదైన మైలురాయిని చేరుకుంది. దీంతో బాలీవుడ్ సినీ చరిత్రలో రెండో వారంలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా దురంధర్ నిలిచింది. ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌కు ఆదిత్య ధార్ దర్శకత్వం వహించారు. ఈ మూవీని కందహార్ విమానం హైజాక్, 2001 పార్లమెంట్ దాడి, 26/11 ముంబయి దాడులు వంటి భౌగోళిక రాజకీయ, ఉగ్రవాద సంఘటనల నేపథ్యంలో సాగే రహస్య గూఢచార కార్యకలాపాల నేపథ్యంలో తెరకెక్కించారు. పాకిస్తాన్ నేపథ్యంలో ఈ మూవీని తెరకెక్కించడంతో అరబ్ దేశాల్లో దురంధర్‌పై నిషేధం విధించారు. జియో స్టూడియోస్, బి62 స్టూడియోస్ బ్యానర్లపై నిర్మించిన ఈ మూవీలో సంజయ్ దత్, అక్షయ్ ఖన్నా, అర్జున్ రాంపాల్, సారా అర్జున్, ఆర్. మాధవన్, రాకేష్ బేడీ కీలక పాత్రల్లో నటించారు.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034